క్లుప్తంగా

నోటాకు తగ్గిన ఓట్లు

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలో 5,46,577 మంది ఓటర్లకు గాను నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో 55.33 శాతం పోలింగ్ నమోదయింది. ఈ ఎన్నికల్లో 2,033 మంది తమ ఓటును నోటాకు వేశారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో 2,171 మంది నోటకు ఓటేశారు. గత ఎన్నికలతో పోల్చితే నోటాకు ఓట్లు తగ్గాయి.

కమలానికి జైకొట్టిన తుక్కుగూడ

తుక్కుగూడ: అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఆదివారం ఓట్ల లెక్కింపులో మంత్రి సబితారెడ్డి మరోసారి విజయం సాధించారు. ఆమెకు నియోజకవర్గ వ్యాప్తంగా ఆధిక్యం కనబరిచినా.. తుక్కుగూడ మున్సిపాలిటీ వాసులు బీజేపీకి లీడ్ ఇచ్చారు. బూత్ నెంబర్ 387 నుంచి 407వరకు బీజేపీకి 6,917, బీఆర్ఎస్‌కు 5,382, కాంగ్రెస్‌కు 2,770 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ కమలం అభ్యర్థి అందెల శ్రీనివాస్ 1,459 ఓట్ల ఆధిక్యతను కనబరిచారు.

సమష్టి విజయం

బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్

తుక్కుగూడ: అందరి సమష్టి కృషితో బీఆర్ఎస్ అభ్యర్థి సబితారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందారని బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్ అన్నారు. సోమవారం ఆయన రావిర్యాలలో విలేకరులతో మాట్లాడుతూ.. సబితారెడ్డి గెలుపునకు పని చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి హోదాలో ఆమె నియోజకవర్గాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడంతోనే ఓటర్లు మరోసారి ఆమెను ఆశీర్వదించారన్నారు.

20 మంది భక్తుల మాలధారణ



మాలధారణతో అయ్యప్ప భక్తులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి బాల మణికంఠ అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం 20 మంది భక్తులు అయ్యప్ప స్వామి మాల ధారణ స్వీకరించారు. ఆలయ ధర్మకర్త మద్ది జగదీశ్వర్ రెడ్డి గురుస్వామి, జగన్మోహన్ రెడ్డి గురుస్వామి, కోట్ల రంగనాథ్ గురుస్వాముల పర్యవేక్షణలో కన్నె స్వాములు ప్రవీణ్, నాగభూషణం, రమేష్ తదితరులు మాల వేసుకున్నారు. నిత్య పూజలతో మామిడిపల్లి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుందన్నారు.

మలక్‌పేట్‌లో విజృంభిస్తున్న దోమలు

దిల్‌సుఖ్‌నగర్: దోమలు ఇళ్లపై దండయాత్ర చేస్తున్నాయి. మలక్‌పేట్ జోన్ పరిధిలో రోజురోజుకూ దోమలు విజృంభిస్తున్నాయి. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, మార్గదర్శికాలనీ, అల్కాపురి, యాదవనగర్ తదితర కాలనీల్లో చీకటి పడితేచాలు ఇళ్లపైకి దండెత్తుతున్నాయి. దోమల మందును పిచికారీ చేయాల్సిన జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులు సరిగా స్పందించకపోవటంతో దోమలు వృద్ధిచెందుతున్నాయి. స్థానికుల నుంచి అందే ఫిర్యాదుల మేరకు అప్పుడప్పుడూ ప్రధాన రహదారిపై ఫాగింగ్ నిర్వహిస్తూ ప్రజలు, అధికారుల దృష్టిలో పడేలా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలో నాలాలు మురికికాలువలు ప్రవహించే బస్తీలను వదిలి కేవలం ప్రధాన రోడ్లపై ఫాగింగ్ చేస్తూ వృథా చర్యలకు పాల్పడుతున్నారు. మూసీ సమీపంలోని కాలనీల్లో దోమలు విజృంభిస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఫాగింగ్ నిర్వహించే శానిటేషన్ సిబ్బంది అడపా దడపా చేస్తున్న బస్తీల్లో ఫాగింగ్ చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది తగిన శ్రద్ధ చూపి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

వైన్‌షాపును తరలించాలి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని జైపురి కాలనీ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వైన్ షాప్‌ను మరో ప్రాంతానికి తరలించాలని జైపురికాలనీ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. జైపురి కాలనీ ఇప్పటికే వెనుకబడి ఉందని, అందరూ పేద, మధ్య తరగతి ప్రజలు ఉంటారని పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలకు ఉపయోగ పడే గ్రంథాలయం ఉండాల్సింది పోయి కాలనీలో వైన్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న మహిళా సంఘాల నాయకులు మొన్నటి వరకు ఓట్ల గురించి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. మహిళలు స్పందించకుంటే వైన్ షాపులు ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జైపురికాలనీ సమీపంలో ఏర్పాటు చేసే వైన్ షాపును మరో ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. వైన్ షాపును జైపురి కాలనీ నుంచి తరలించకుంటే కాలనీ వాసులమంతా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

హర హర మహాదేవ

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతాలు సోమవారం శివ నామ స్మరణతో మారుమోగాయి. వారం రోజులుగా కొనసాగుతున్న బుగ్గ రామలింగేశ్వరస్వామి జాతరకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఫలితాన్ని శాసించిన జల్‌పల్లి జనం

- మున్సిపల్ పరిధి నుంచి బీఆర్ఎస్‌కు 15వేల లీడ్
- ద్వితీయ స్థానంలో కాంగ్రెస్
- శ్రీరాం కాలనీలో కమల వికాసం

పహాడీషరీఫ్: హోరా హోరీగా కొనసాగిన ఎన్నికల సమరంలో నియోజకవర్గంలో తొలిసారి గులాబీ జెండా రెపరెపలాడింది. మున్సిపల్ ప్రజలు బీఆర్ఎస్‌కు భారీ ఆధిక్యాన్ని కట్టబెట్టారు. అందరూ ఊహించినట్లుగానే నియోజకవర్గ ఫలితాన్ని జల్‌పల్లి మున్సిపల్ వాసులే శాసిస్తారనే ఊహను నిజం చేశారు. 15వేల ఓట్ల మెజార్టీని ఇచ్చి సబితారెడ్డిని గెలిపించారు. ఇక్కడ దాదాపు 37 వేల ఓట్లు పోలైతే...అందులో బీఆర్ఎస్‌కు ఏకంగా 23 వేల ఓట్లు పోలయ్యాయి. 8,702 ఓట్లతో కాంగ్రెస్ ద్వితీయ స్థానానికి పరిమితం కాగా.. గెలుపుపై ధీమాగా ఉన్న బీజేపీ 4,706 ఓట్లకు పరిమితమైంది. ఇక్కడ బీఎస్పీ అభ్యర్థి కేఎంఆర్‌కు వంద ఓట్లు పోలయ్యాయి.

45శాతం పోలింగ్

మున్సిపల్ పరిధిలో దాదాపు 60వేల మైనార్టీ ఓటర్లున్నారు. మైనార్టీ బస్తీల్లో 45 శాతం వరకు పోలింగ్ నమోదవ్వగా 27వేల ఓట్లు పోలయ్యాయి. మజ్లిస్‌తో బీఆర్ఎస్‌కు స్నేహబంధం ఉండడం, మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సైతం ఇక్కడ సభ పెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరడంతో ఎక్కువ శాతం బీఆర్ఎస్ వైపు మొగ్గుచూపి దాదాపు 19వేల ఓట్ల వరకు వేశారు. ద్వితీయ ఆప్షన్ కింద ఎంచుకున్న కాంగ్రెస్ పార్టీకి 7వేల ఓట్లు పడగా.. సాధారణంగానే మైనార్టీలలో బీజేపీ పట్ల వ్యతిరేక భావం ఉన్న నేపథ్యంలో ఆ పార్టీకి 500 వరకు ఓట్లు పోలయ్యాయి. ఇతరులందరు కలిసి 120 వరకు మాత్రమే ఓట్లను దక్కించుకున్నారు.

'కారు'కే ఆధిక్యం

మున్సిపల్ పరిధిలోని కొత్తపేట గ్రామంలో 684, ఎర్రకుంటలో 2023, జల్‌పల్లిలో 340 ఓట్ల మెజార్టీ సాధించగా శ్రీరాం కాలనీలో బీజేపీ 781 ఓట్ల ఆధిక్యాన్ని కనబరిచింది. వాదే హుదా బస్తీలో 661, వాదే ముస్తఫా బస్తీలో 978, పహాడీషరీఫ్‌లో 2,203, క్యూబా కాలనీలో 576, హైవే హోటల్ పరిసర బస్తీల్లో 627, షాహిన్‌నగర్ ప్రధాన చౌరస్తా ప్రాంతంలో 655, అలైన్, బిస్మిల్లా కాలనీలు, వీఐపీ స్కూల్ ప్రాంతంలో 1833 ఓట్లు బీఆర్ఎస్ లీడ్ చూపింది. బిస్మిల్లా కాలనీ, ఉస్మాన్‌నగర్, వాదే సాల్హె హీన్ బస్తీల్లో 2,218 ఓట్లతో కారుకు మెజార్టీ ఇచ్చారు.



కందుకూరు: సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

మున్సిపల్ పరిధిలో పోలైన ఓట్ల వివరాలు

గ్రామం	బీఆర్ఎస్	బీజేపీ	కాంగ్రెస్	బీఎస్పీ
కొత్తపేట	1,611	227	927	–
ఎర్రకుంట	3059	87	996	–
జల్‌పల్లి	1340	1000	582	13
శ్రీరాంకాలనీ	1948	2729	582	40
వాదే హుదా బస్తీ	1014	20	353	–
వాదే ముస్తఫా బస్తీ	1330	11	352	–
పహాడీషరీఫ్	3164	530	961	10
క్యూబా కాలనీ	862	7	286	–
హైవే హోటల్	1004	12	377	–
షాహిన్‌నగర్ చౌరస్తా	940	23	285	–
అలైన్, బిస్మిల్లా కాలనీ, వీఐపీ స్కూల్ ప్రాంతం	3329	32	1496	–
బిస్మిల్లా కాలనీ, ఉస్మాన్‌నగర్, వాదే సాల్హె హీన్ బస్తీల్లో	3349	28	1311	–



జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

మహేశ్వరం మండల పరిధిలో..

గ్రామం	బీజేపీ	బీఆర్ఎస్	కాంగ్రెస్	ఆధిక్యం/పార్టీ
గొల్లూరు	342	332	419	77/కాంగ్రెస్
నాగిరెడ్డిపల్లి	338	353	60	15/బీఆర్ఎస్
నాగారం	1179	1425	406	246/బీఆర్ఎస్
నందుపల్లి	306	405	84	99/బీఆర్ఎస్
హర్షగూడ	785	860	140	95/బీఆర్ఎస్
తుమ్మలూరు	877	561	538	316/బీజేపీ
మోహబ్బత్‌నగర్	164	160	118	4/బీజేపీ
సిరిగిరిపురం	388	448	79	60/బీఆర్ఎస్
గంగారం	265	241	142	24/బీజేపీ
మహేశ్వరం	2927	2529	1222	398/బీజేపీ
మన్సాన్‌పల్లి	238	777	543	234/బీఆర్ఎస్
పెండ్యాల	485	497	401	12/బీఆర్ఎస్
డబిల్‌గూడ	301	233	13	68/బీజేపీ
అమీర్‌పేట్	1086	1075	656	11/బీజేపీ
చిన్నతూప్ర	515	460	208	55/బీజేపీ
కల్వకోల్	404	543	204	139/బీఆర్ఎస్
మాణిక్యమ్మగూడ	314	451	32	137/బీఆర్ఎస్
సుభాన్‌పూర్	398	646	339	248/బీఆర్ఎస్
దుబ్బచర్ల	258	631	375	256/బీఆర్ఎస్
ఘట్టుపల్లి	348	449	318	101/బీఆర్ఎస్
ఆకన్‌పల్లి	158	257	363	106/కాంగ్రెస్
కోళ్లపడకల్	266	518	446	72/బీఆర్ఎస్
పోరండ్ల	178	290	327	37/కాంగ్రెస్
మొత్తం	12,520	14,141	7,433	–

భక్తి శ్రద్ధలతో అన్నాభిషేకం

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని గౌరీ నీలకంఠేశ్వర స్వామి లక్ష్మీ గణపతి దేవాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా అన్నాభిషేకం నిర్వహించారు. వేద పండితులు శ్రీకాంత శర్మ, అర్చకులు లక్ష్మీగణపతిరావులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, శ్రీనివాస ప్రసాద్, హయగ్రీవశర్మ మూర్తి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

ప్రమాదకరంగా పైపులు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని తొర్రూర్ వైపు వెళ్ళే పాతరోడ్డులో నడిరోడ్డుపై వదిలేసిన పైపులు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుపై గొయ్యి ఏర్పడడంతో రెండు నెలల క్రితం ఇక్కడ డ్రైనేజీ ట్రంకులైను పైపులను తొలగించి కొత్తగా పైపులు వేశారు. ఈ క్రమంలో భూమిలో నుంచి తొలగించిన పైపులను రోడ్డుకు ఓ వైపున పడేశారు. పనులు పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా అక్కడినుంచి పైపులను తొలగించలేదు. పైపులను తొలగించకపోవడంతో వాహనాలు వాటిని ఢీ కొట్టే ప్రమాదం ఉంది. రోజూ వేల కొద్దీ వాహనాలు వెళ్లే ఈ రోడ్డుపై పైపులను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైపులు రోడ్డుపై ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పైపులను తొలగించాలని కోరుతున్నారు.



కాంగ్రెస్ హవాలో కొట్టుకుపోయిన పార్టీలు

ఇబ్రహీంపట్నం: శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఇబ్రహీంపట్నం స్థానం నుంచి పోటీ చేసిన అభ్యర్థుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మినహా అభ్యర్థులందరి డిపాజిట్లు గల్లంతయ్యాయి. ఈ నియోజకవర్గం నుంచి 28 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలబడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి 1,26,506 ఓట్లు రాగా.. బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి 89,806 ఓట్లు పోలయ్యాయి. సమీప అభ్యర్థిపై రంగారెడ్డి 36,700 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

బీజేపీకి తగ్గిన ఓట్లు

ప్రధాని మోదీ ప్రభావం, బీసీ ముఖ్యమంత్రి నినాదం నియోజకవర్గంలో పనిచేయలేదు. 2018 ఎన్నికల్లో బీజేపీకి 17 వేలు ఓట్లు పడ్డాయి. ఈ సారి ఆ పార్టీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్ 15,790 ఓట్లు రాబట్టారు. గత ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటింగ్ శాతం తగ్గింది.

ప్రభావం చూపని సీపీఎం

ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి పగడాల యాదయ్యకు 3,948 ఓట్లు మాత్రమే పడ్డాయి. 2018 ఎన్నికల్లో 9 వేలకు పైగా ఓట్లు సాధించిన ఆ పార్టీ.. ఈ సారి మరింత దిగజారిపోవడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. నియోజకవర్గంలో రోజురోజుకు సీపీఎంకు ఆదరణ తగ్గుతుండటం గమనార్హం.

బీఎస్పీ విఫలం

ఈ ఎన్నికల్లో బీఎస్పీ అసలు ప్రభావం చూపలేదు. 2,114 ఓట్లకే ఆ పార్టీ పరిమితమయింది. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పార్టీ పగ్గాలు చేపట్టిన అనంతరం బీఎస్పీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని అందరూ భావించారు. ఓట్లు రాబట్టడంలో ఆ పార్టీ అభ్యర్థి గొరిగే మల్లేశ్ విఫలమయ్యారు.

సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోండి

సీపీఐ నాయకుల డిమాండ్

ఇబ్రహీంపట్నం: తమ నాయకుడిపై చేయి చేసుకున్న సీఐ, ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఇబ్రహీంపట్నంలో ర్యాలీగా వెళ్లి.. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవీంద్రచారి, నర్సింహా, నియోజకవర్గ ఇన్‌చార్జి యాదిరెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోస్టల్ బ్యాలెట్ బ్యాక్సులు తెరిచారని కాంగ్రెస్, సీపీఐ శనివారం నిరసన తెలుపుతుంటే.. స్థానిక సీఐ గోవింద్‌రెడ్డి, ఎస్ఐ నాగరాజు అకారణంగా తమ పార్టీకి చెందిన కృష్ణపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు తెలిపారు. పోలీస్ అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హరిసింగ్ నాయక్, లక్ష్మణ్, శివరాల లక్ష్మయ్య, శ్రీశైలం, నర్సింహ, సురేశ్, యాదయ్య, శ్రీ హరి పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నేతలు

మధుయాష్కీకి కలిసిరాని ఎల్‌బీనగర్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్నప్పటికీ మారిన రాజకీయ పరిణామాల కారణంగా ఎన్నికల ముందు వచ్చిన మధుయాష్కీగౌడ్‌కు ఎల్‌బీనగర్ ప్రజలు షాక్ ఇచ్చారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి రెండు సార్లు కాంగ్రెస్, ఒకసారి తెలుగుదేశం పార్టీలు విజయం సాధించగా ఈ సారి గులాబీ జెండాకు జైకొట్టారు. 2009లో ఏర్పడిన ఎల్‌బీనగర్ నియోజకవర్గం మినీ ఇండియాకు మారు పేరు. ఇక్కడ అన్ని కులామతాలకు సంబంధించిన వ్యక్తులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన ప్రజానీకం అధికం నియోజకవర్గంలో అధిక శాతం విద్యావంతులు కావడంతో ఎప్పుడు ఎలాంటి తీర్పు ఇస్తారో తెలియని ఆయోమయం. 2009లో జరిగిన ఎన్నికలలో ప్రస్తుత ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి టీడీపీపైన విజయం సాధించారు. 2014లో బీసీ నాయకులు ఆర్.కృష్ణయ్య బీర్ఎస్ అభ్యర్థి రాంమోహన్‌గౌడ్ పై విజయం సాధించగా ఈ ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి మూడో స్థానానికి పరిమితమయ్యారు.2018 ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి మరో సారి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి రాంమోహన్‌గౌడ్‌పై విజయం సాధించారు. తర్వాత జరిగిన పరిణామాలతో సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడంతో కాంగ్రెస్ పార్టీకి పెద్ద దెబ్బ తగిలింది. గ్రేటర్ ఎన్నికలలో సైతం కాంగ్రెస్ పార్టీ ఘోరపరాభవం చవిచూసింది. ఈ పార్టీకి నియోజవర్గంలో సరైన నాయకత్వం లేక పోవడంతో పార్టీ బలహీనపడింది.

పార్టీ ఓటమికి కారణాలు..

సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరడంతో పార్టీ ముఖ్యనాయకులు కూడా ఆయనతో పాటు బీఆర్ఎస్‌లో చేరారు.దీంతో సరైన నాయకత్వం లేకపోవడంతో పార్టీ చతికిలపడింది. కరోన సమయంలో పార్టీ సేవలు కాని, విపత్కర సమయంలో ప్రజలకు ఆ పార్టీ నాయకులు అందుబాటులో లేక పోవడంతో ప్రజలు కాంగ్రెస్‌కు దూరం అయ్యామయ్యారని చెప్పవచ్చు. గ్రేటర్ ఎన్నికలలో మల్‌రెడ్డి రాంరెడ్డిని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా నియమించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యతను అయన మీద ఉంచారు.మరో సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి సైతం పార్టీ పటిష్టతకు పాదయాత్రలు నిర్వహించారు. అయినప్పటికి ఎల్‌బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కాలేదు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు మధయాష్కీగౌడ్ ఎల్‌బీనగర్ నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి తనే పోటీ చేస్తానని పేర్కొనడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసి ఈ పంచాయతీని డిల్లీకి తీసుకెళ్లారు.అయిన అధిష్టానం మధుయాష్కీగౌడ్‌కే ప్రాధాన్యత ఇవ్వడంతో టికెట్టు ఆయననే వరించింది.బీసీ నేతనైన తనకు బీసీలు మద్దతు ఇచ్చిగెలిపిస్తారని ఆశతో బరిలోకి దిగారు.

కలిసిరాని బీసీ జపం

ఎల్‌బీనగర్‌లో 2014లో బీసీ నాయకులు ఆర్.కృష్ణయ్య బీసీ నేపంతో పోటీ చేయడంతో అధిక మెజార్టీతో ప్రజలు గెలిపించారు. దీంతో అదే ఫార్ములా పని చేస్తుంది అనే ఆశతో మధుయాష్కీగౌడ్ పోటీ చేశారు. కానీ ప్రజలు ఈ సారి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టి కాంగ్రెస్‌ను తిరస్కరించారు. ఏకంగా కాంగ్రెస్ ఈ ఎన్నికలలో మూడో స్థానానికి పరిమితమైంది. బీజేపీ రెండో స్థానంలో నిలిచింది.



ఎక్కడ పడితే అక్కడ చెత్త

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని అనేక ప్రాంతాలలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంతో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తపేరుకుపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. హస్తినాపురం, వనస్థలిపురం, చంపాపేట్, లింగోజిగూడ డివిజన్లపరిధిలో జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం మూలంగా క్షేత్ర స్థాయిలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడంలేని దీనితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యపనులు సక్రమంగా జరిగేవిదంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



స్వాములకు సన్మానం

కడ్తాల్: గడ్డమీదితండా గ్రామ పంచాయతీకి చెందిన కిషన్, లచ్చిరామ్, పాండునాయక్, జగన్, పాండునాయక్ పాండునాయక్ 44రోజుల క్రితం అయ్యప్ప మాల ధరించి, పాదయాత్ర ద్వారా శబరిమల యాత్ర పూర్తి చేసుకుని స్వగ్రామం చేరుకున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం తండాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాండు నాయక్ ఆధ్వర్యంలో వీరిని ఘనంగా సన్మానించారు. బన్సీ, పంత్యానాయక్, సురేశ్, నర్యా, శ్రీను, ప్రవీణ్, రమ్య, వినోద్, శ్రీను ఉన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన నాయకులు

చైతన్యపురి: అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, గడ్డిఅన్నారం బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డిలు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ ఎమ్మెల్యేగా మూడోసారి విజయం సాధించిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సోమవారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్ పార్క్ కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



సుధీర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆకట్టుకుంటున్న హ్యాండ్లూమ్ మేళా



మేళాలో కొనుగోలుదారుల కిటకిట

వనస్థలిపురం: వనస్థలిపురంలో హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా (ఎగ్జిబిషన్ అండ్ సేల్)కు విశేష స్పందన లభిస్తోంది. మేళాలో కొలువైన దుస్తులు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికులు ఆసక్తి చూపిస్తున్నారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు, బ్యాగులు, గాజులు, ముత్యాలు తదితర వస్తువుల కొనుగోలుకు ఆదరణ బాగుందని నిర్వాహకులు అక్బర్ అలీ తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

ఆమనగల్లు: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఆమనగల్లు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి అన్నారు. విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కరాటే మాస్టర్ సోని ఆధ్వర్యంలో కరాటే శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం రామలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. ఆత్మరక్షణకు బాలికలు కరాటేపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా అమ్మాయిలపై జరుగుతున్న దాడులను ఎలా ఎదుర్కోవాలి, విపత్కర పరిస్థితుల నుంచి ఎలా బయటపడాలి అనే విషయాలపై విద్యార్థినులకు మాస్టర్ సోని వివరించారు. ఉపాధ్యాయులు సుశీల, సుగుణ, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో విద్యార్థులకు కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్